APTEL/26/A4269

అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ ఆదివారం 01 నవంబర్ 2026 సంపుటి: 01 సంచిక :155 పేజీలు : 04 వెల: 2-00/-

రాప్తాడు విద్యార్థినిపై దాడి ఘటన.. తీవ్రంగా ఖండించిన ఏపీ మంత్రులు



రాప్తాడు జెడ్పీ స్కూల్‌లో టెన్త్ విద్యార్థినిపై ఓ ఉన్మాది రంపంతో దాడి చేసిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనపై ఏపీ మంత్రులు స్పందిస్తూ.. తీవ్రంగా ఖండించారు.

అమరావతి, అక్టోబర్ 31: రాప్తాడు జెడ్పీ స్కూల్‌లో టెన్త్ విద్యార్థినిపై ఓ ఉన్మాది రంపంతో దాడి చేసిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనపై ఏపీ మంత్రులు స్పందిస్తూ.. తీవ్రంగా ఖండించారు. నిందితుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిస్తుందని హామీ ఇచ్చారు. రాప్తాడు ఘటన చాలా దురదృష్టకరమని హోంమంత్రి అనిత అన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మిగతా..2లో

తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్




అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజుల వర్ష సూచన

నేటి నుంచి నవంబర్ 4 వరకు వానలు కురిసే అవకాశం

హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

హైదరాబాద్: అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేటి నుంచి నవంబర్ 4వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. వాతావరణ శాఖ నివేదిక ప్రకారం, అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోంది. దీని ప్రభావంతో ఈరోజు సాయంత్రం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మిగతా..2లో

ఏపీకి మరో తుఫాన్ ముప్పుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి



- రాష్ట్రానికి మరో తుఫాన్ ముప్పుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.
- తుఫాన్ గమనంపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని ఆదేశించారు.

అమరావతి, అక్టోబరు 31: రాష్ట్రానికి మరో తుఫాన్ ముప్పుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. తుఫాన్ గమనంపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని ఆదేశించారు. ఆర్నబ్ తుఫాన్ విధ్వంసం అనంతరం జరుగుతోన్న

ఏపీకి మరో వాయు'గండం' - రేపు సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం

- ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్, నికోబార్ దీవుల ప్రాంతాలలో తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడింది.
- రానున్న 12 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారి, తుపానుగా మారే అవకాశం ఉంది.

అమరావతి : ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్, నికోబార్ దీవుల ప్రాంతాలలో తీవ్ర అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారింది. దక్షిణ, ఉత్తర అండమాన్ సముద్రం, అండమాన్, నికోబార్ దీవుల పరిసరాల్లో ఉన్న అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమై ఉంది. మిగతా..2లో

కోస్తాంధ్రకు మరో వాయు'గండం'



ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థిని బెంగళూరు తరలింపు..



- గ్రీన్ ఛానల్ ఏర్పాటుకు లోకేశ్ చొరవ
- ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిక
- మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలింపు
- మంత్రి నారా లోకేశ్ చొరవతో మెరుగైన వైద్యం ఏర్పాట్లు
- బెంగళూరు మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడిన లోకేశ్
- గ్రీన్ ఛానల్ కోసం కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు
- అధికారులు, వైద్యులతో ఎప్పటికప్పుడు సమీక్ష

అమరావతి : అనంతపురం జిల్లా రాప్తాడులోని జడ్పీ హైస్కూల్‌లో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి విద్యార్థినిని మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. మిగతా..2లో

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు..



- కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో నవంబర్ 2వ తేదీన పర్యటించనున్నారు.
- రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమిత్ షా పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

హైదరాబాద్, అక్టోబరు 31 : కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలంగాణలో నవంబర్ 2వ తేదీన పర్యటించనున్నారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. ఈ మేరకు అమిత్ షా పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

దావోస్ వేదికగా సీఎం విజయ్ సరికొత్త చరిత్ర.. తమిళనాడు నుంచి తొలి ముఖ్యమంత్రిగా రికార్డు..!

- తమిళనాడు పారిశ్రామిక అభివృద్ధిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ముఖ్యమంత్రి విజయ్ కీలక ముందడుగు వేశారు.
- స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరంలో జరగనున్న ప్రతిష్టాత్మక ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సుకు ఆయన హాజరుకానున్నారు.



ఢిల్లీ : టీవీకే వర్గాలు ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించాయి. తమిళనాడు రాజకీయ చరిత్రలో పదవిలో ఉన్న ఒక ముఖ్యమంత్రి దావోస్ సదస్సుకు వెళ్లడం ఇదే ప్రథమం. గతంలో డీఎంకే ప్రభుత్వ హయాంలో పరిశ్రమల మంత్రులు తంగం తెన్నరసు, టీఆర్‌బీ రాజా మాత్రమే ఈ సదస్సుకు హాజరయ్యారు. తాజా పర్యటన ద్వారా ప్రపంచ దిగ్గజ సంస్థల అధినేతలతో సీఎం స్వయంగా సమావేశమై, రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేలా ఒప్పించనున్నారు. ఇటీవల లండన్ పర్యటన ముగించుకున్న విజయ్, ఇప్పుడు దావోస్ వేదికగా తమిళనాడును ప్రధాన ఆకర్షణగా నిలపాలని భావిస్తున్నారు.

కేంద్రంపై టీవీకే విమర్శలు.. లక్ష కోట్ల లక్ష్యం

పెట్టుబడుల ఆకర్షణ విషయంలో ప్రభుత్వం మిగతా..2లో

ఇండీ కూటమి మాక్ పార్లమెంట్ సీఈసీపై అభిశంసన తీర్మానం

- దిల్లీలో కాంగ్రెస్ మాక్ పార్లమెంట్ నిర్వహించింది.
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టింది.



ఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్‌ను నడుపుతున్నారని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దీనివల్ల దేశంలో సామాన్యుడి ఓటు హక్కు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేయాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను నిలిపివేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. శనివారం దిల్లీలోని ఖర్గే అధికారిక నివాసంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన ప్రతిపక్ష ఇండీ కూటమి 'మాక్ పార్లమెంట్' సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ 'బహిరంగ ప్రజా అభిశంసన' తీర్మానం ప్రవేశపెట్టింది. అనంతరం ఖర్గే మాట్లాడుతూ, సీఈసీ కుమార్‌పై 'ఆరోపణలను' మిగతా..2లో

తెలంగాణలో క్రాప్ హాలిడేపై మంత్రి తుమ్మల క్లారిటీ



- రాష్ట్రంలో క్రాప్ హాలిడేపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు.
- తెలంగాణలో ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్, అక్టోబరు 31 : రాష్ట్రంలో క్రాప్ హాలిడేపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని స్పష్టం చేశారు. (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. క్రాప్ హాలిడేపై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న ప్రచారం అవాస్తవమని.. రైతులు ఈ విషయాన్ని నమ్మొద్దని అన్నారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్త విపత్తు అని..

తాగునీటి కోసం రూ.120 కోట్లు.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం

- ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- నాలుగు జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయానికి రూ.120 కోట్లు
- ఇతర జిల్లాలకు ఒక్కోటి రూ.కోటి చొప్పున నిధులు
- బోరుబావులు, ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశం



హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మిగతా..2లో

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా? ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్



- బ్యాంకు ఆస్తుల విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ
- రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వస్తే నిబంధనలు మార్చడంపై ప్రశ్నలు
- ఉద్యోగుల ఆందోళనలను కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపాటు

హైదరాబాద్ : ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి అమ్ముజూపడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. "ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి.

మొదటి పేజి తరువాయి

ఉన్మాది దాడిలో గాయపడిన విద్యార్థిని బెంగళూరు తరలింపు.. గ్రీన్ చానల్ ఏర్పాటుకు లోకేశ్ చొరవ

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో ఈ ఏర్పాట్లు చకచకా జరిగాయి. బాలికను బెంగళూరులోని ప్రఖ్యాత మణిపాల్ ఆస్పత్రిలో చేర్పించి, అత్యుత్తమ వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. విషయం తెలిసిన వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్, విద్యార్థినిని బెంగళూరు తరలించడానికి ముందే మణిపాల్ ఆసుపత్రికి చెందిన ఉన్నతస్థాయి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వివరించి, సాధ్యమైనంత ఉత్తమమైన చికిత్స అందించాలని వారిని కోరారు. అంతేకాకుండా, అంబులెన్స్ వేగంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆసుత్రికి చేరుకునేందుకు వీలుగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని కర్ణాటక ప్రభుత్వంతో మంత్రి లోకేశ్ నేరుగా సంప్రదింపులు జరిపారు. దాడి ఘటన తెలిసిన క్షణం నుంచే మంత్రి లోకేశ్.. పోలీసు, విద్య, జిల్లా అధికార యంత్రాంగాలను అప్రమత్తం చేశారు. ప్రతిక్షణం అధికారులతో మాట్లాడుతూ పరిస్థితిని సమీక్షించారు. బాధితురాలికి మెరుగైన వైద్య సహాయం అందించడమే ఏకైక లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, వైద్యులతో సమన్వయం చేసుకుంటూ బెంగళూరు తరలింపు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఏపీకి మరో తుఫాన్ ముప్పుపై

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

పునరుద్ధరణ పనులు, వాతావరణ పరిస్థితులపై సీఎం చంద్రబాబు ఈరోజు (శనివారం) సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కేంద్రంలో సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంవాలపై ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడినట్లుగా సీఎంకు అధికారులు వివరించారు. రేపటికి ఈ వాయుగుండం తుఫాన్‌గా బలపడే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లోని గుంటూరు నుంచి దిగువ ప్రాంతాలు, రాయలసీమ జిల్లాల్లో వర్షాలకు అస్కారం ఉందని అధికారులు తెలిపారు. నవంబర్ 2, 3, 4 తేదీల్లో చాలా చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలకు అస్కారం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్, రాడార్ల సాయంతో ముందస్తుగా తుఫాన్ గమనాన్ని అంచనా వేసి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమీక్షకు ఐటీ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విద్యుత్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సహా వివిధ టెలికాం ఆపరేటర్ల ప్రతినిధులు హాజరయ్యారు.

తాగునీటి కోసం రూ.120 కోట్లు..

మంత్రి సీతక్క కీలక నిర్ణయం

మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన..

పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని అంచనా వేసింది. ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో, నవంబర్ 3న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు సూచించారు.

దావోస్ వేదికగా సీఎం విజయ్ సరికొత్త చరిత్ర..

తమిళనాడు నుంచి తొలి ముఖ్యమంత్రిగా రికార్డు..!

విఫలమవుతోందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను టీవీకే అధికార ప్రతినిధి ఎం. సత్యకుమార్ తీవ్రంగా ఖండించారు. విదేశీ పెట్టుబడులు రాబట్టడంలో కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ శాఖల నుంచి తమిళనాడుకు తగిన సహకారం అందడం లేదని ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తున్నంత ప్రాధాన్యతను తమిళనాడుకు ఇవ్వడం లేదని విమర్శించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. కేంద్రం నుంచి ఆశించిన సహకారం లేనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం స్వశక్తితో దాదాపు లక్ష కోట్ల రూపాయల విలువైన పెట్టుబడుల హామీలను సాధించగలిగిందని టీవీకే స్పష్టం చేసింది. ఈ ఒప్పందాలను త్వరితగతిన క్షేత్రస్థాయి పరిశ్రమలుగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపింది. రాష్ట్రంలో ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్న పారిశ్రామిక సంస్థలు తమ వ్యాపారాలను మరింత విస్తరించేలా ప్రోత్సహించడం కూడా ఈ వ్యూహంలో భాగమని పేర్కొంది. దావోస్ వేదికపై విజయ్ పర్యటన ద్వారా అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో సరికొత్త భరోసా ఏర్పడుతుందని, తమిళనాడు సరికొత్త పారిశ్రామిక హబ్‌గా ఎదుగుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?

ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్

రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వచ్చినప్పుడు నిబంధనలు, మదింపు పద్ధతులను ఎందుకు మార్చారు? ఐడీబీఐ ఉద్యోగులు లేవనెత్తుతున్న ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు?“ అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని నిలదీశారు. “ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ఇంత తొందర ఎందుకు?“ అని ఆయన అన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్ షా

తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారు..



2వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి ఆయన చేరుకోనున్నారు. బేగంపేట నుంచి కాకతీయ హోటల్‌కు వెళ్లనున్నారు. 4గంటల వరకు కాకతీయ హోటల్‌లో కేంద్ర హోం మంత్రి బసచేయనున్నారు. 4గంటలకు బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు నిర్వహించనున్న ర్యాలీలో అమిత్ షా పాల్గొననున్నారు. 5 గంటల నుంచి 5:30 వరకు ఎంజే మార్కెట్ వద్ద జరిగే కార్నర్ మీటింగ్‌కు అమిత్ షా హాజరుకానున్నారు. అనతరం 6గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4గంటల వరకు ఉన్న రిజర్వ్ షెడ్యూల్‌లో రాష్ట్రంలోని ప్రముఖులను కేంద్ర హోం మంత్రి కలిసే అవకాశాలు ఉన్నాయి. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ ముఖ్య నేతలతో కూడా అమిత్ షా భేటీ అయ్యే ఛాన్స్ ఉంది.

ఏపీకి మరో వాయు'గండం' - రేపు సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం

మొదటి పేజి తరువాయి



ఇది రాగల 12 గంటల్లో ఇదే ప్రాంతంలో పశ్చిమ-వాయవ్య దిశగా పయనించి తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఎక్కువగా ఉంది. ఆ తర్వాత ఇది మరింత తీవ్రమై రేపు సాయంత్రానికి తుపానుగా మారే అవకాశం కనిపిస్తోంది. తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా మారి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకు వస్తుండటంతో వాతావరణ శాఖ కోస్తా ఆంధ్రప్రదేశ్‌కు హెచ్చరికలు జారీ చేసింది. రేపు కోస్తా తీర ప్రాంతాల్లో కొన్ని చోట్ల భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబర్ 2, 3 తేదీల్లో వాయుగుండం తీరానికి బాగా దగ్గరగా రావడం వల్ల కొన్ని జిల్లాల్లో అతి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికను జారీ చేసింది. ఈ వాయుగుండం ప్రధానంగా దక్షిణ కోస్తా, ఉత్తర తమిళనాడు సరిహద్దులపై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. నెల్లూరు, తిరుపతి, బాపట్ల, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో రేపు రాత్రి నుంచి నవంబర్ 3 వరకు అత్యధిక ప్రభావం ఉండే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అదికారులు సూచిస్తున్నారు. ఉత్తర కోస్తాలోని విశాఖపట్నం, కాకినాడ, గోదావరి జిల్లాల్లో సైతం నవంబర్ 2, 3 తేదీల్లో విస్తారంగా వర్షాలు, ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో సముద్రం చాలా కల్లోలంగా ఉంటుంది. రేపటి నుంచి నవంబర్ 4 వరకు రాష్ట్రం తీరం వెంబడి పశ్చిమ- మధ్య బంగాళాఖాతంలోకి మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. 13 జిల్లాల్లో వర్షాలు: శనివారం పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, మార్కాపురం, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఎల్లో అలర్ట్ జారీ: మరో 3 గంటల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, నెల్లూరు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవనున్నాయని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన గాలులకు అవకాశముందని పేర్కొంది. గంటకు 30-40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండడంతో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అదేవిధంగా శుక్రవారం సాయంత్రం 6 గంటల నాటికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నగరంలో 91.5 మి.మీ., పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 81.2, అనకాపల్లి జిల్లా చోడవరంలో 80.2, కాకినాడ జిల్లా వేలంగిలో 76.9, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో 76.7, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో 54.2, అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో 52.5మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైందని పేర్కొంది.

ఇండీ కూటమి మాక్ పార్లమెంట్ - సీఈసీపై అభిశంసన తీర్మానం

మొదటి పేజి తరువాయి



ప్రతిపక్ష ఎంపీలు హాజరయ్యారు.

సభలో చదివి వినిపించారు. జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని ఖర్గే ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేసి ఆయనను ఆ పదవిలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సీఈసీని తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు ఇప్పటికే పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపాదనలు ప్రవేశపెట్టారని, కానీ తమ నోటీసులను స్వీకరించలేదని ఖర్గే చెప్పారు. అందువల్లే ఈ సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. 'రాజ్యాంగ సంస్థ గౌరవాన్ని కాపాడటానికే ఈరోజు ఈ ప్రతిపాదనను తీసుకువచ్చాం. సీఈసీపై మాకు ఎలాంటి వ్యక్తిగత విద్వేషం లేదు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం. 2014 నుంచి అధికారంలో కొనసాగేందుకు మోదీ ప్రభుత్వం అన్ని కుట్రలు చేస్తోంది. 2023 చట్టం కల్పిస్తున్న రక్షణ కారణంగానే సీఈసీ ఓటు చోరీకి పాల్పడుతున్నారు. సర్ ప్రక్రియ ద్వారా దేశంలో ఉద్దేశపూర్వకంగానే 14 కోట్ల మంది ఓట్లను తొలగించారు. ఈ చట్టం ఆయనకు అన్ని విధాల చర్యల నుంచి రక్షణ కల్పిస్తోంది. 145 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేసి, వారిని సభా కార్యకలాపాలలో పాల్గొనకుండా నిరోధించిన తర్వాత ఈ చట్టాన్ని ఆమోదించారు. అందుకే దీన్ని వెంటనే రద్దు చేయాలి. సర్ ప్రక్రియను నిలిపివేసి అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి. దేశంలో ఎన్నికలు ఏవైనా సరే వాటిని బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి. ఇవే ఇండీ కూటమి ప్రధాన డిమాండ్లు' అని ఖర్గే అన్నారు. లోక్‌సభను పోలి ఉన్నట్లుగా ఈ మాక్ పార్లమెంట్ వేదికను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఇండీ కూటమి నేతలు,

రాప్తాడు విద్యార్థినిపై దాడి ఘటన.. తీవ్రంగా ఖండించిన ఏపీ మంత్రులు

మొదటి పేజి తరువాయి



విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా ఎస్పీకి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షిస్తామన్నారు. విద్యార్థిని అతి త్వరగా కోలుకోవాలని భావిస్తున్నామని.. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హోంమంత్రి భరోసా ఇచ్చారు.

బాలికపై రంపంతో దాడి బాధాకరం: మంత్రి సవిత

రాప్తాడులో బాలికపై దాడి ఘటనపై మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ జగదీశ్‌తో ఫోన్లో మాట్లాడారు. నిందితుడిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఆదేశించారు. నిందితుడు ఎంతటివాడైనా, ఏ పార్టీ వాడైనా ఉపేక్షించొద్దని తెలిపారు. క్షమించరాని నేరానికి పాల్పడ్డాడని మండిపడ్డారు. మహిళలు, బాలికల భద్రతే కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మహిళలవైపు ఎవరైనా కన్నెత్తి చూడాలంటే భయపడేలా కఠినంగా శిక్షించాలన్నారు. తరగతి గదిలోనే విద్యార్థినిపై రంపంతో దాడి చేయడం బాధాకరమన్నారు. చదువుల తల్లి ఒడి విద్యార్థిని రక్తంతో తడవడం ఆవేదనకు గురిచేస్తోందని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు.

నిందితుడిపై చట్టపరమైన చర్యలు: మంత్రి టీజీ భరత్

రాప్తాడులో విద్యార్థినిపై అమానుష దాడి ఘటనపై మంత్రి టీజీ భరత్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిపై రంపంతో దాడి ఘటన దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి అనంతపురం జిల్లా కలెక్టర్, ఎస్పీతో మంత్రి ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. దాడి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి టీజీ భరత్ సూచించారు.

బాలికపై దాడి కలచివేసింది: మాధవ్

రాప్తాడులో బాలికపై దారుణం కలచివేసిందని.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆడపిల్లలు, మహిళల జోలికి రావాలంటే భయపడేలా చట్టాన్ని అమలు చేయాలన్నారు. పిల్లల భద్రతలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా బాధ్యత వహించాల్సిందే అని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

ఘటనపై తక్షణమే స్పందించిన ఏపీ మహిళా కమిషన్

రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి ఘటనపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ స్పందించారు. దాడిని అడ్డుకునే క్రమంలో గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపైనా చైర్‌పర్సన్ ఆరా తీశారు. బాధిత విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై మహిళా కమిషన్ ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటోంది.

తెలంగాణలో క్రాప్ హాలిడేపై మంత్రి తుమ్మల క్లారిటీ

మొదటి పేజి తరువాయి



ఈ విషయంలో ముందస్తు జాగ్రత్తలను తాము తీసుకుంటున్నామని తెలిపారు. ఆరు నెలలుగా రైతన్నలకు ఎల్‌నినోపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి, సమీకృత పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు.

రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలి..

ప్రతి వారం వాతావరణం, వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను అన్నదాతలకు చేరవేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. రైతులకు సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో 365 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించి, రైతన్నలకు అండగా తమ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అన్నదాతలకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తోందని తెలిపారు. రైతన్నలను నష్టాల నుంచి కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం వస్తోందని.. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కల్పిస్తోందని వెల్లడించారు. నవంబర్ నుంచి మార్చి వరకు మొత్తం 35.21 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ఆ భూమిలోనే అయోధ్య రామమందిరం నిర్మించారా? తేల్చాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్



గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన భూమిలోనే అయోధ్య రామమందిర నిర్మాణం జరిగిందా? లేదా? అన్నది తేల్చాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది.

అయోధ్య రామమందిరాన్ని 2019లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన అదే స్థలంలో నిర్మించారా? లేదా? అనేది నిర్ధరించేందుకు ఒక కమిటీ లేదా కమిషన్ ను ఏర్పాటు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. 2019 నవంబర్ 9న సుప్రీంకోర్టుకు చెందిన ఐదుగురు న్యాయమూర్తులు కలిగిన రాజ్యాంగ ధర్మాసనం చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో ఒక ట్రస్ట్ ద్వారా రామమందిర నిర్మాణం చేపట్టేందుకు మార్గాన్ని సుగమం చేసింది. అంతేకాదు, సున్నీ వక్ఫ్ బోర్డుకు మసీదు నిర్మాణం కోసం ప్రత్యామ్నాయంగా 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సర్వోన్నత న్యాయస్థానం ఏకగ్రీవంగా ఇచ్చిన ఈ తీర్పు ప్రకారం, కూల్చివేసిన బాబ్రీ మసీదు ఉన్న 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో ఉంచుకోవాలి. ఆ తర్వాత ఆలయ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న ట్రస్టుకు మూడు నెలల్లోపు ఆ భూమిని అప్పగించాలి. పిటిషన్ లో ఏముంది? సుప్రీంకోర్టు వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, 'శ్రీరామ జన్మభూమి కేసు ట్రస్ట్ ' ఈ పిటిషన్ దాఖలు చేసింది. కాగా, ఈ పిటిషన్ నవంబర్ 2న విచారణకు రానుంది. దీనిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ , జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేయనుంది. ప్రస్తుతం దాఖలైన పిటిషన్ లో, సుప్రీంకోర్టు గతంలో ఏ భూమిపై రామమందిరం కట్టాలని నిర్దేశించిందో, అందులోనే రామమందిర నిర్మాణం జరిగిందా? లేదా? అని నిర్ధరించాలని కోరారు. అలాగే సదరు భూమికి సంబంధించి స్వతంత్ర సర్వే లేదా సరిహద్దు గుర్తింపు చేపట్టాలని కోరారు. ఇందులో భాగంగా, ఆ భూమి కచ్చితమైన సరిహద్దులు, కోఆర్డినేట్లు, విస్తీర్ణం, స్థానాన్ని గుర్తించాలని అభ్యర్థించారు. "ప్రస్తుతం నిర్మించిన లేదా అభివృద్ధి చేసిన ఆలయం, ఈ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన అదే స్థలంలో ఉందా, లేదా అనేది నిర్ధరించాలి. ఇందుకోసం సర్వోన్నత ధర్మాసనం ఒక స్వతంత్ర కమిటీ లేదా కమిషన్ ను ఏర్పాటు చేయాలి. ఇందులో సర్వే, రెవెన్యూ పురావస్తు, ఇతర రంగాలకు చెందిన నిపుణులు ఉండాలి. ఒకవేళ వారి పరిశీలనతో, గతంలో సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న ప్రాంగణానికి, ఆలయం నిర్మించిన ప్రాంగణానికి మధ్య ఏమైనా గణనీయమైన వ్యత్యాసాలు కనిపిస్తే, 2019 నాటి తీర్పును యథాతథంగా అమలు చేసేలా తగిన ఆదేశాలు జారీ చేయాలి" అని ఈ పిటిషన్ లో కోరారు. "ఆలయ ప్రాంగణాన్ని గుర్తించడం, సరిహద్దులను నిర్ణయించడం, అభివృద్ధి చేయడానికి సంబంధించిన అన్ని అసలు పత్రాలు, మ్యాప్ లు, ప్రణాళికలు, సర్వేలు, రికార్డులను భద్రపరచాలి. అలాగే వాటిని న్యాయస్థానం ముందు ఉంచాలని సంబంధిత అధికారులను, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టును ఆదేశించాలి" అని ఆ పిటిషన్ లో పేర్కొన్నారు. కాగ్ చేత ఆడిట్ చేయించాలి! "ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే భక్తుల కోసం అవసరమైన సౌకర్యాలను కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలి. అలాగే విరాళాలు, కానుకలు, రసీదుల వివరాలను ప్రతిరోజూ డిజిటలైజ్ చేసి, వాటిని నిరంతరం ప్రదర్శించాలి. అలాగే నిధులు దుర్వినియోగాన్ని అరికట్టేందుకు 'కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా' (కాగ్) చేత ఏటా ఆడిట్ నిర్వహించాలి" అని సదరు పిటిషన్ లో అభ్యర్థించారు.

ఇంతకీ ఏమిటీ వివాదం?

అయోధ్యలోని వివాదాస్పద స్థలంలో 16వ శతాబ్దానికి చెందిన బాబ్రీ సమీదు ఉండేది. 1992 డిసెంబర్ 6న హిందూ కరసేవకులు దీనిని కూల్చేశారు. దీనితో అక్కడ మతపరమైన అల్లర్లు చెలరేగాయి, కేసులు నమోదు అయ్యాయి. 2010లో అలహాబాద్ హైకోర్టు, అయోధ్యలోని 2.77 ఎకరాల భూమిని సున్నీ వక్ఫ్ బోర్డుకు, నిర్మోహి అఖారా, రామ్ లల్లా అనే మూడు పక్షాలకు సమానంగా పంచాలని తీర్పునిచ్చింది. దీనిపై వచ్చిన 14 అప్పీళ్లపై సుప్రీంకోర్టు విచారణ జరిపి 2019లో చారిత్రాత్మక తీర్పునిచ్చింది. సదరు వివాదాస్పద భూమిలో రామమందిర నిర్మాణం చేపట్టడానికి మార్గం సుగమం చేసింది.

అనంత సూర్య తెలుగువార

ఆ ఉన్మాదిని వదిలే ప్రసక్తే లేదు.. పరిటాల సునీత

అనంతపురం, అక్టోబర్ 31 అనంత సూర్య : రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన అమానుష దాడి తనను ఎంతో కలచి వేసిందని.. ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఈ ఘటనపై సమాచారం తెలిసిన వెంటనే ఆసుపత్రికి చేరుకున్న ఆమె, చికిత్స పొందుతున్న గోపికను చూశారు. అలాగే ఈ దాడిలో గాయపడిన మరో విద్యార్థిని, షాక్ గురైన మరో విద్యార్థిని పరామర్శించారు. గోపిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. అనంతరం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న కుటుంబ సభ్యులతో మాట్లాడడంతో పాటు, ముఖ్యమంత్రి చంద్రబాబు గారిచే ఫోన్లో వారిని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి సంఘటన జరగడం.. అందునా అంత దారుణంగా దాడి చేయడం కలిచి వేసిందన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ తీవ్రంగా స్పందించారన్నారు. ముగ్గురు నేతలూ నేరుగా ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలను ఆరా తీశారని.. తీవ్ర ఆవేదనకు గురైన తల్లిదండ్రులతో ఫోన్లో మాట్లాడారన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని గట్టి భరోసా ఇచ్చారు.




నిందితుడు ఎంతటి వాడైనా సరే, చట్టం ముందు కఠినంగా శిక్షిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వ యాక్షన్ అత్యంత వేగంగా, కఠినంగా ఉంటుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థుల రక్షణ కోసం ఇకపై ప్రతి పాఠశాల ప్రాంగణంలో భద్రతా నియమాలను కఠినతరం చేస్తామని స్పష్టం చేశారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి మెరుగైన వైద్యంతో పాటు, ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలను త్వరితగతిన అందిస్తామన్నారు. నియోజకవర్గంలో మహిళలు, బాలికల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే సునీత తెలిపారు..

అభివృద్ధి, సంక్షేమ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇదే లక్ష్యంతో రెండున్నరేళ్ల పాలన సాగింది

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, అక్టోబర్ 31 అనంత సూర్య : అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వ్యవసాయ ప్రగతి లక్ష్యంగా రెండున్నరేళ్ల కూటమి పాలన సాగిందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార పర్వం సందడిగా సాగింది. ఎమ్మెల్యే సునీతతో పాటు టీడీపీ నాయకులు, భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి గ్రామాల్లో పర్యటించారు. కనగానపల్లి మండల జడ్పీటీసీ అభ్యర్థి సాకే పోతలయ్య, మామిళ్లపల్లి ఎంపీటీసీ అభ్యర్థి బట్టా అనిత, దాదులూరు ఎంపీటీసీ అభ్యర్థి తలారి శ్రావణి, తూముచర్ల ఎంపీటీసీ అభ్యర్థి యాతం పోతలయ్యలను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఆమె ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆత్మకూరు మండలం సనప గ్రామంలో కూడా సునీత ప్రచారం సాగింది. ఆత్మకూరు జడ్పీటీసీ అభ్యర్థి బండి భారతి, స్థానిక ఎంపీటీసీ అభ్యర్థి పోతలయ్యకు మద్దతుగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అప్పటికే అక్కడ ప్రచారం



నిర్వహిస్తుండగా ఆయనతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ కలిసి కూటమి అభ్యర్థుల గెలుపు కోసం రోడ్ షో నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కనగానపల్లి మండలంలో గత రెండేళ్లలో జరిగిన రూ.80 కోట్లకు పైగా అభివృద్ధి పనులను వివరించారు. మండలంలో రూ. 32 కోట్లతో సిసి, తారు రోడ్లు, రూ. 80 లక్షలతో 3 హెల్త్ క్లినిక్‌లు, రూ. 2.60 కోట్లతో కేజీబీవీ జూనియర్ కాలేజీ అప్‌గ్రేడేషన్, తాగునీటి జూబ్లూ పథకం నిర్వహణకు రూ. 1.20 కోట్లు వెచ్చించామన్నారు. ముఖ్యంగా దాదులూరులో రూ. 10 కోట్లతో నూతన ఇండస్ట్రియల్ పార్క్, మత్తవకుంట్ల సబ్‌స్టేషన్ కోసం రూ. 3.30 కోట్లు, కనకదాస కళ్యాణమండపానికి రూ. 60 లక్షలు, మరియు రెడ్డివారికుంట చెరువు మరమ్మతులకు రూ. 90 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేసిన ఈ రికార్డు స్థాయి ప్రగతిని చూసి ఓటేయాలని, గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వైసిపికి ఈ స్థానిక ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో ప్రజలంతా కలిసి గెట్టి బుద్ధి చెప్పాలని పరిటాల సునీత, ఎంపీ పార్థసారథి పిలుపునిచ్చారు. అంతేకాకుండా అభివృద్ధి సంక్షేమం విషయంలో కక్షలు కార్పన్యాలకు వెళ్లకుండా అన్ని పార్టీల నాయకులు కలసి రావాలని, మన గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న చావడి భవనానికి నిధులు కేటాయించి నూతన భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

బాలాజీ ఫార్మసీ కళాశాలలో కృత్రిమ మేధస్సు అంశంపై జాతీయ సదస్సు

అనంతపురం, అక్టోబర్ 31 అనంత సూర్య : స్థానిక బాలాజీ ఫార్మసీ కళాశాలలో "ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధస్సు.. రోగి భద్రత, రోగ నియంత్రణ కోసం కృత్రిమ మేధస్సు సమన్వయం" అనే అంశం మీద జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయ అకడమిక్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై నేటి సమాజంలో కృత్రిమ మేధస్సు అన్ని రంగాల్లో విస్తరిస్తోందనీ, ఔషధ రంగంలో సమాజానికి ఉపయోగపడే విధంగా ఫార్మసిస్టులు కూడా ఈ కృత్రిమ మేధస్సును వినియోగించి నూతన ఆవిష్కరణలను చేయాలని సూచించారు. కార్యక్రమంలో బెంగళూరు ఎంఎస్ రామయ్య యూనివర్సిటీ, ఫార్మసీ విభాగంలో ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్న డా.సరస్వతి వ్యాధులను గుర్తించి నివారించడంలో వైద్యులకు, ఫార్మసిస్టులకు కృత్రిమ మేధస్సు ఎలా ఉపయోగపడుతుందనే అంశం మీద ఉపన్యాసం



ఇచ్చారు. ఇదే కార్యక్రమంలో మరొక అతిథిగా విచేసిన హైదరాబాద్‌లోని సీసీఎంబీ బయో సైన్సెస్ వ్యవస్థాపకులు డా.దినేష్ క్యాన్సర్‌ను గుర్తించడం, నివారించడంలో కృత్రిమ మేధస్సు ఉపయోగం గురించి ఉపన్యసించారు. తదనంతరం విద్యార్థులు వీరితో ముఖాముఖిలో పాల్గొని తమ సందేహాలని నివృత్తి చేసుకున్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పల్లె వెంకట కృష్ణ కిశోర్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో కృత్రిమ మేధస్సును వినియోగించి సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేసి సమాజానికి అండగా తమ విద్యార్థులను తీర్చి దిద్దటమే లక్ష్యంగా పని చేయాలని అధ్యాపకులు, విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు నేడు ప్రపంచాన్ని శాసించే దిశగా అభివృద్ధి చెందుతోందని, ఈ రంగంలో ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజవర్ధన్, కోఆర్డినేటర్ డాక్టర్ గీతవాణి, అధ్యాపక సిబ్బంది పాల్గొనారు. కార్యక్రమానికి జేఎన్‌టీయ, ఎస్కేయ కర్నూలు, ఎమ్మిగనూరులోని ఫార్మసీ కళాశాలల నుండి సుమారు 140 మంది విద్యార్థులు హాజరయ్యారని, వారికి ఔషధ రంగంలో కృత్రిమ మేధస్సు అంశంపై ఓరల్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్ నిర్వహించారని ఆర్గనైజర్ డాక్టర్ రాజవర్ధన్ తెలిపారు. విజేతలకు బహుమతి ప్రధానం చేశారు.

విద్యార్థినిపై దాడి చేసిన నిందితున్ని ఉరి తీయాలి

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కేశవ గౌడ్


అనంతపురం, అక్టోబర్ 31 అనంత సూర్య : రాప్తాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై విచక్షణా రహితంగా దాడి చేసిన నిందితున్ని వెంటనే ఉరి తీయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కేశవ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థినిల పట్ల దాడులు ఎక్కువయ్యాయని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల ఒక మానవ రూపంలో ఉన్న రాక్షసుడు చెట్లను కోసే మిషన్ తీసుకొని వచ్చి తరగతి గదిలో ఉన్న



విద్యార్థినీల మధ్య వారిని భయభ్రాంతులకు గురి చేస్తూ అతి కిరాతకంగా విద్యార్థినిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. మానవ మృగం దాడిలో మరొక విద్యార్థినికి తీవ్రమైన గాయాలు పాలవడం బాధాకరమన్నారు. విద్యార్థినిల పట్ల దాడికి పాల్పడిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలతో పాటు వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన పట్ల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి నిందితునిపై కఠిన చర్యలు చేపట్టడంతోపాటు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.


విద్యార్థినిపై హత్యాయత్నాన్ని ఖండించిన జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం

అనంతపురం, అక్టోబర్ 31 అనంత సూర్య : రాప్తాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఒక విద్యార్థినిపై జరిగిన హత్యాయత్నం అత్యంత హేయమైన, ఆందోళనకరమైన ఘటన అని, ఈ అమానవీయ దాడిని అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం తీవ్రంగా ఖండించింది. విద్యార్థుల్లో పెరుగుతున్న ఆవేశపూరిత ప్రవర్తన, హింసాత్మక ధోరణులు సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశాలు.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, పరస్పర గౌరవం, మానవీయత వంటి సద్గుణాలను పెంపొందించాల్సిన బాధ్యత విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, సమాజంపై ఉందన్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో విద్యార్థినుల భద్రతకు



అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులు ఎలాంటి భయం, అభద్రతాభావం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా ప్రభుత్వం, విద్యాశాఖ, సంబంధిత అధికారులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆమెకు, ఆమె కుటుంబ సభ్యులకు అవసరమైన రక్షణ, మానసిక ధైర్యాన్ని కల్పించాలని సంఘం నాయకులు కోరారు. భవిష్యత్తులో ఇలాంటి అమానవీయ ఘటనలు పునరావృతం కాకుండా విద్యాసంస్థల్లో భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, విద్యార్థుల్లో నైతిక విలువలు, సంయమనం, మానవీయ దృక్పథం పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ ఘటనపై సంఘం అధ్యక్షులు గోపాల్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రమణ రెడ్డి, గౌరవ సలహాదారు రామాంజనేయులు, కోశాధికారి రామచంద్ర, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, సిటీ ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, సిటీ జనరల్ సెక్రటరీ విజయ్ కుమార్ తదితర సంఘం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఈ ఘటనను ఖండించారు.

యాడికి రామన్న గుడిసెల్లో గృహప్రవేశానికి హాజరైన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు బాల రమేష్ బాబు



యాడికి అనంత సూర్య ప్రతినిధి అక్టోబర్ (31) : యాడికి మండలం రామన్న గుడిసెలు గ్రామంలో గృహ ప్రవేశం కార్యక్రమం అలాగే అదే గ్రామంలో వీజ్ఞెఎ ఓజ్ఞెఎ ఎన్నికల ప్రచారం లో పాల్గొన్న యాడికి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు అన్నగారు అలాగే వీజ్ఞెఎ అభ్యర్థి మాదాల రామకృష్ణ పరమహంస గారు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు ఈ కార్యక్రమంలో యాడికి 6 ఎజ్ఞెఎ భర్త దస్తగిరి రామాంజనేయలురెడ్డి పేరం చలపతి రెడ్డి సుబ్బారెడ్డి భాస్కర్ రెడ్డి బూషి సత్య రంగయ్య చిన్న సుద్దాల రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



అనంతపురం, అక్టోబర్ 31 అనంత సూర్య : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి విద్యా మందిరం వారితో కలిసి నగదు ఆర్థిక సహాయం, ట్రస్ట్ ద్వారా రెండు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులను చైర్‌పర్సన్ నిర్మలమురళి అందజేశారు. రేణుకాకు వారి భర్త అనారోగ్య పరిస్థితి వల్ల ఇబ్బంది పడుతున్నారని, ఆమెకు సరస్వతీ విద్యా మందిరంలోని ఆచార్యులు, మాతాజీలు కలిసి కొంత ధనం, ట్రస్ట్ ద్వారా రెండు నెలలకు సరిపడా 34 రకాల నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఉన్న వారికి స్నేహితులు, బంధువులు, తెలిసినవారు చేతనైనంత సహాయం చేయాలన్నారు. చేయి చేయి కలిస్తే వారికి ఒక చేయూత అవుతుందన్నారు. కష్టం ఏ ఇంటికి ఏ రూపంలో అయినా రావచ్చు.. అలాంటి పరిస్థితుల్లో చూస్తూ ఊరుకోకుండా వీలున్నంత సహాయం అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సేవాగుణంతో మెలగాలని కోరారు. మన ఇంటిలో ఉన్న చిన్న పిల్లలకు చిన్నప్పటి నుంచి ఇతరులకు సేవా సహాయం చేసే విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు, మాతాజీలు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థినిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం, అక్టోబర్ 31 అనంత సూర్య : అనంతపురం జిల్లా రాప్తాడు మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినిపై దుండగులు దాడి చేయడం చాలా బాధాకరమని బీసీవై విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినిపై



తరగతి గదిలోకి దుండగులు ప్రవేశించి చెక్క మొద్దులు కోసే మిషన్ (రంపం)తో దాడికి పాల్పడ్డారంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కనీసం చదువుకుంటున్న విద్యార్థినులకు రక్షణ లేకుండా ఉందంటే, తక్షణమే ఈ సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినీలకు రక్షణ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలకే వెళ్లి విద్యార్థులపై దాడులు, హత్యలు, అత్యాచారాలు చేస్తుంటే, ఈ రాష్ట్రంలో ఒక మహిళ హోం మినిస్టర్ ఉన్నా స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలకు కూతవేటకు దూరంలోనే పోలీస్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయం ఉన్నప్పటికీ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దారుణమన్నారు. తక్షణమే ఈ సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆ విద్యార్థిని కుటుంబానికి అండగా ఉంటూ.. ఆ విద్యార్థినిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భద్రతా వైఫల్యం.. ఆడ పిల్లలకు రక్షణ కరువైంది..



అనంతపురం, అక్టోబర్ 31 అనంత సూర్య : రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై ఎలక్ట్రిక్ రంపంతో జరిగిన దాడిని అఖిల భారత యువజన సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్ కుమార్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఆడపిల్లలకు కనీస రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వ భద్రతా వ్యవస్థ వైఫల్యం వల్ల విద్యార్థినులు పాఠశాలల్లో సైతం భయాందోళనల మధ్య చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లోకి మారణాయుధాలతో వ్యక్తులు ప్రవేశించి దాడులకు పాల్పడుతుంటే ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఆడపిల్లలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా పాఠశాలల్లో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించి, వారి కుటుంబాలకు తగిన ఆర్థిక సహాయం ప్రకటించాలని కోరారు.నిందితుడిపై వేగవంతమైన విచారణ జరిపి కఠిన శిక్ష విధించాలని, రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం


గుడిపాల,అక్టోబర్ 31(అనంత సూర్య):జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 5న జరగనున్న రెండో సాధారణ ఎన్నికల్లో భాగంగా గుడిపాల మండల పరిషత్ పరిధిలోని జడ్పీటీసీ,ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు రిటర్నింగ్ అధికారి పెంచల కిషోర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.నవంబర్ 1, 2 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుడిపాల మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటూ గుడిపాల మండల పరిధిలో ఓటు హక్కు కలిగిన పోలింగ్ సిబ్బంది తమ దరఖాస్తుతో పాటు ఎన్నికల విధుల ఉత్తర్వులు, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ ప్రతులను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలని సూచించారు.

టీడీపీ అభ్యర్థి మేనక జోరుగా ప్రచారం



గుడిపాల,అక్టోబర్ 31(అనంత సూర్య): గుడిపాల మండలం వసంతాపురం తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి మేనక ప్రేమ్‌కుమార్ శనివారం బొజ్జవారిపల్లి, కుప్పిగానిపల్లి,కండ్రిగ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉమ్మడి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తనకు మద్దతు తెలిపి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మేనక ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలపై తనకు అవగాహన ఉందని తెలిపారు. ఎంపీటీసీగా తనను గెలిపిస్తే గ్రామాల్లోని ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

నేను మీవాడిని.. నన్ను గెలిపించండి



గుడిపాల,అక్టోబర్ 31(అనంత సూర్య):గుడిపాల మండలం వసంతాపురం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి రజినీకాంత్, జడ్పీటీసీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి శనివారం నరహరిపేట, పెద్ద దళవాయిపల్లి,చిన్న దళవాయిపల్లి గ్రామాల్లో ఉమ్మడి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తమకు మద్దతు తెలిపి గెలిపించాలని అభ్యర్థించారు.ఈ సందర్భంగా ఎంపీటీసీ అభ్యర్థి రజినీకాంత్ మాట్లాడుతూ "నేను మీవాడిని.. మీలో ఒకడిగా ఉంటూ మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.నన్ను ఆదరించి ఎంపీటీసీగా గెలిపించండి" అని గ్రామస్థులను కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.జడ్పీటీసీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి కూడా ఓటర్లను కలిసి తమ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీటీసీగా ఒక్క అవకాశం ఇవ్వండి



గుడిపాల,అక్టోబర్ 31 (అనంత సూర్య):గుడిపాల మండలంలోని 197 రామాపురం ఎంపీటీసీ సెగ్మెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మలర్‌కొడి శనివారం సింగరపేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓటర్లను కలుసుకుని తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు.ఎంపీటీసీగా తనకు ఒక్క అవకాశం కల్పించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని మలర్‌కొడి ప్రజలను కోరారు. ప్రజల ఆదరణతో ఎన్నికల్లో విజయం సాధించి ఎంపీటీసీగా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలు తనకు మద్దతుగా నిలవాలని కోరుతూ ప్రచారం కొనసాగించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్ధన్, కుమార్ తదితరులు పాల్గొని అభ్యర్థి మలర్‌కొడికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

చదువు తల్లిపై రంపం వేటు

బడి పిల్లలకు రక్షణ ఇవ్వలేని వ్యవస్థలు!

దారి తప్పుతున్న యువత.. పాలచర్ల ముత్యాలు..

అనంత సూర్య న్యూస్:31: రాప్తాడులో జరిగింది ఒక దాడి కాదు, చదువు తల్లి గుండెల్లోనే రంపాన్ని దించిన దారుణం. పదవ తరగతి చదువుతున్న ఒక చిన్నారి, క్లాస్ రూమ్ లో టీచర్ పాఠం చెబుతుంటే, తోటి విద్యార్థులు చూస్తుండగానే... చెట్లను కోసే ఎలక్ట్రిక్ రంపంతో వచ్చి, ఆ చిన్నారి శరీరాన్ని ముక్కలు చేయాలనే రాక్షస ఆలోచనతో దాడి చేశాడు ఒక నర రూప రాక్షసుడు. తరగతి గది రక్తమయం – టీచర్లు, విద్యార్థులు భయభ్రాంతులు! ఆ దృశ్యాన్ని చూసిన టీచర్లు, పిల్లలు ఏం చేయాలో తెలియక స్తంభించిపోయారు. చేతిలో రంపం ఉన్న రాక్షసుడి ముందు వారి అరుపులు కూడా వినిపించలేదు. పాఠశాల అంటేనే సరస్వతి దేవాలయం, అలాంటి దేవాలయాన్ని కూడా కాపాడలేని వ్యవస్థలు ఏం చేస్తున్నాయి. దారి తప్పుతున్న యువత – ఇది సమాజానికి హెచ్చరిక! ధర్మవరం మండలం నాగలూరుకు చెందిన నిందితుడు హేమంత్, కేవలం 21 ఏళ్ల యువకుడు. ప్రేమ తిరస్కరించిందని ఒక చిన్నారి జీవితాన్ని నాశనం చేయాలనుకోవడం... ఇది ప్రేమ కాదు, ఇది మానసిక రాక్షసత్వం. సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో యువత దారి తప్పుతోంది. ఇది ప్రతి తల్లిదండ్రులు ఆలోచించాల్సిన విషయం. మా డిమాండ్ – ఈ నర రూప రాక్షసుడిని వెంటనే ఎన్ కౌంటర్ చేయాలి! ఇలాంటి మృగాన్ని మరో బిడ్డపై దాడి చేయకుండా ఉండాలంటే, ఇలాంటి వారికి ఎన్ కౌంటర్ చేయాలి చట్టం ప్రకారం కఠినాతి కఠిన శిక్ష పడేలా, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసు నడిపి ఉరి శిక్ష వేయాలని, బాధిత బాలికకు ప్రభుత్వం మెరుగైన వైద్యం, నష్ట పరిహారం ఇవ్వాలని. టిడిపి హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి ముత్యాలు డిమాండ్ చేశారు...

ప్రశాంత పోలింగ్‌కు పోలీసుల పటిష్ఠ బందోబస్తు



చిత్తూరు,అక్టోబర్ 31(అనంత సూర్య):స్థానిక మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహబూబ్ బాషా సూచించారు.ప్రజాస్వామ్య భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీసుల అప్రమత్తతతో పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగిసేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఆదివారం జరగనున్న స్థానిక మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బందోబస్తుకు కేటాయించిన పోలీసు అధికారులు, రూట్ ఆఫీసర్లు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించి విధులపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల బందోబస్తు సిబ్బంది, మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, క్యూఆర్‌టీ, ప్రత్యేక స్ట్రైకింగ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తే అవకాశం ఉంటే వెంటనే ఉన్నతాధికారులు, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు.చిత్తూరు సబ్ డివిజన్ డీఎస్పీ జె. వెంకటనారాయణ మాట్లాడుతూ పోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, క్యూలైన్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా బందోబస్తు సిబ్బంది పోలింగ్ స్టేషన్లలోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు గుంపులుగా గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.పోలింగ్ ముగిసిన అనంతరం ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే వరకు పటిష్ఠ భద్రత కల్పించాలని ఆదేశించారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, సమన్వయం, బాధ్యతతో విధులు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చూడాలని అధికారులు సూచించారు.ఈ సమావేశంలో ఏఆర్ డీఎస్పీ రామకృష్ణ, సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరిస్తే జడ్పీ చైర్మన్ అవుతా!

గుడిపాల మండల అభివృద్ధికి కృషి చేస్తా జడ్పీటీసీ అభ్యర్థి మమతశ్రీ

గుడిపాల,అక్టోబర్ 31(అనంత సూర్య):గుడిపాల మండల ప్రజలు ఆదరించి తనను జడ్పీటీసీగా గెలిపిస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అవకాశం కల్పిస్తే చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేస్తానని టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి మమతశ్రీ అన్నారు. శనివారం మండలంలోని నంగమంగళం,పానాటూరు గ్రామాల్లో ఎంపీటీసీ అభ్యర్థులు సంగీత, జయ చిత్రతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో టీడీపీ సీనియర్ నాయకురాలు సీకే లావణ్య, ఎమ్మెల్యే స-తీమణి ప్రతిమ పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా



ఓటర్లను కలిశారు.పానాటూరులో ప్రచారంలో భాగంగా బజ్జి బోండా అంగడి వద్దకు వెళ్లిన అభ్యర్థులు, నాయకులు అక్కడి వారితో కొద్దిసేపు ముచ్చటించారు. వారితో కలిసి బజ్జీలు, బోండాలు తయారు చేసి, అనంతరం వాటిని రుచి చూశారు. ఈ సందర్భంగా స్థానికులతో ఆప్యాయంగా ముచ్చటిస్తూ వారి ఆదరణ కోరారు.ఈ సందర్భంగా మమతశ్రీ మాట్లాడుతూ గుడిపాల మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీటీసీగా గెలిచిన అనంతరం ముఖ్యమంత్రి అవకాశం కల్పిస్తే జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి చిత్తూరు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్బా నాయుడు, అనిల్, దీపశ్రీ, ఉదయ, గోళ్ళ

రైతులు అప్రమత్తంగా ఉండాలి మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, అక్టోబర్ 31 (అనంత సూర్య): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి తుఫానుగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నవంబర్ 2వ తేదీ సాయంత్రానికి తుఫాను ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపించే అవకాశం ఉందని, నవంబర్ 2, 3 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని తెలిపారు.భారీ వర్షాల వల్ల పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. వరి, పత్తి, మిర్చి, ఉద్యాన పంటల పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువలను సిద్ధం చేసుకోవాలని, కోతలు పూర్తయిన పంట ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించి తడవకుండా కాపాడుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు పంట కోతలు, పురుగుమందుల పిచికారీ, ఎరువుల వినియోగాన్ని వాయిదా వేసుకోవాలని సూచించారు.బలమైన గాలులు, పిడుగులు పడే సమ-యంలో రైతులు పొలాల్లోకి వెళ్లవద్దని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య శాఖల అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన సూచనలు అందించాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమన్వయం చేసుకుంటూ పంట నష్టాన్ని తగ్గించే సాంకేతిక సలహాలు ఇవ్వాలని, అవసరమైన విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉ-త్పాదకాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి రైతుల నుంచి వచ్చే సమాచారంపై వెంటనే స్పందించాలని అధికారులకు తెలిపారు.ఇటీవల



తుఫాను ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు మరోసారి వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధైర్యపడవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ ప్రాధాన్యమని, ప్రతి రైతుకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. వాతావరణ శాఖ, విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసే తాజా సూచనలను రైతులందరికీ చేరవేస్తూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

ప్రయాణం ఎటువైపు? మధుసూదన్ రాజకీయ ఆసక్తిపై ఎదురుచూపు

గుడిపాల రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేవనుందా?

నేడు ఆత్మీయ సమావేశం

గుడిపాల,అక్టోబర్ 31(అనంత సూర్య):గుడిపాల మండల రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామానికి వేదిక సిద్ధమవుతోంది. మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, బలిజ సంఘం చిత్తూరు జిల్లా నాయకుడు కుప్పిగానిపల్లి గ్రామానికి చెందిన ఓ.యం.పి. మధు-సూదన్‌రావు తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్న దానిపై స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.ప్రస్తుతం తాను కొనసాగుతున్న వైఎస్సా-ర్‌సీపీలో తనకు న్యాయం జరగడం లేదని, తగిన గుర్తింపు లభించడం లేదని మధుసూదన్‌రావు స్వ-యంగా వెల్లడించడం ఈ చర్చకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. గతంలో సర్పంచ్, ఎంపీటీసీగా పనిచేసిన అనుభవంతో పాటు పార్టీ రాష్ట్ర స్థాయి బాధ్యతలు, బలిజ సంఘం నాయకుడిగా ఆయనకున్న పరిచయాలు, రాజకీయ సంబంధాలు తదుపరి నిర్ణయంపై ఆసక్తిని పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో నవంబర్ 1వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు కందగిరి కొండ ఎదురుగా ఉన్న



తన తండ్రి స్వర్గీయ ఓ.యం. పండరినాథం గారి స్థలంలో మిత్రులు, బంధువులు, ఆత్మీయులతో సమావేశం నిర్వహించనున్నారు. రాజకీయాల్లో నిబద్ధత, నిస్వార్థం, నిజాయతీతో కూడిన విలువలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలన్నదే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశమని ఆయన ఆహ్వానంలో పేర్కొన్నారు.ఈ సమావేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, గుడిపాల మండలంలో పార్టీ రాజకీయాలు, తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణ, అనుచరులు మరియు ఆత్మీయుల అభిప్రాయాలపై చర్చించే అవకాశం ఉంది. వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతారా? పార్టీ నాయకత్వం నుంచి తనకు ఆశించిన గుర్తింపు లభిస్తుందా? లేక మరో రాజకీయ వేదికను ఎంచుకుంటారా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.ముఖ్యంగా బలిజ సామాజికవర్గంలో ఆయనకున్న పరిచయాలు, రాజకీయ అనుభవం దృష్ట్యా ఆయన తీసుకునే నిర్ణయం మండల రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ఆసక్తి నెలకొంది. అయితే ఇతర పార్టీల్లో చేరికపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.నేటి సమావేశం కేవలం ఆత్మీయుల సమాలోచనకే పరిమితమవుతుందా? లేక మధుసూదన్‌రావు రాజకీయ భవిష్యత్‌కు సంబంధించి కీలక నిర్ణయానికి వేదిక అవుతుందా? అన్నది వేచి చూడాలి. ఆయన తదుపరి రాజకీయ ప్రయాణం ఏ దిశగా సాగుతుందో సమావేశం అనంతరం స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405